

19 నుంచి ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



సమ్మె నోటీసుతో నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో పనిచేస్తుంది ఇంజనీరింగ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఈనెల 19 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు శివారావు తెలిపారు. జీతాల పెంపుదల కోసం, సర్వీస్ క్రమబద్ధీకరణ, చనిపోయిన లేదా వికలాంగుల లైన కార్మికులకు నష్టపరిహారం చెల్లింపు తదితర సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు, ఈనెల 19 నుండి సమ్మె చేస్తున్నట్లు వారు అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కు సమ్మె నోటీసు అందజేశా మన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు గుత్తుల సత్య శ్రీనివాసు, మట్టపర్తి నాగార్జున, వడ్డీ శ్రీనివాస్, గుబ్బల ప్రసాద్ తెలిపారు.

శిథిలావస్థకు యర్రపోతవరం లాకులు

- 95 ఏళ్లుగా సేవలందించిన లాకులు
- మరమ్మతులు చేపట్టాలంటున్న రైతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

యర్రపోతవరం లాకులు శిథిలావస్థకు చేరాయి. రామచంద్రపురం మండలంలోని కపిలేశ్వరపురం నుండి వెంకటాయపాలెం మీదుగా ఇంజరం వెళ్లే పంట కాలువకు ఎర్రపోతవరం వద్ద లాకులు నిర్మించారు. ఈ కాలువ కపిలేశ్వరపురం, రామచంద్రాపురం, కాజులూరు మండలాల్లోని సుమారు 5000 ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తుంది. ఇంజరం కెనాల్ గా పిలవబడే ఈ కాలువకు ఎర్ర పోతవరం వద్ద 1930 సంవత్సరంలో లాకులు నిర్మించారు. దీంతో పాటుగా ఇక్కడ నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది నివాసముండేందుకు క్వార్టర్లు నిర్మించారు. సుమారు 95 ఏళ్లపాటు సేవలందించిన లాకులు నేడు శిథిలావస్థలు చేరుకున్నాయి. దీంతో తరచూ నీరు లీక్ అవుతుంది. దీంతోపాటుగా దక్షిణం వైపు రాళ్లగుంట వెళ్లే కాలువకు నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరుకుని పెద్ద పెద్ద రంధ్రలు ఏర్పడ్డాయి. లాకులకు ఏర్పాటు చేసిన తలుపులు రంధ్రాలు పడి చిల్లులు పడిపోగా, ఇనుప ఊచలు, గేట్లు, తుప్పు పట్టి పోయాయి. దీంతో ప్రతి ఏడాది వేసవిలో సాగునీరు ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. లాకులు మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడంతో ఈ ఏడాది వీటి మరమ్మతులు లేనట్టేనని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక లాకులు తో పాటు సిబ్బంది ఉండే క్వార్టర్లు కూడా శిథిలమైపోవడంతో ఇక్కడ ఎవరూ నివసించడం లేదు. నివాసయోగ్యంగా లేని క్వార్టర్లలో ఉండేందుకు ఎవరు ఇష్టపడకపోవడంతో అవి మరింత శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనికి సంబంధించిన సిబ్బంది కూడా లాకుల వద్ద ఎవరు ఉండకపోవడంతో ఇక్కడ పరిస్థితిని పట్టించుకునే నాథుడే లేడని పలువురు రైతులు వ్యాఖ్యానిస్తున్నారు.దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి లాకులకు మరమ్మతులు చేయించాలని, పాడైన గేట్లను పూర్తిగా తొలగించి ఆధునిక గేట్లు ఏర్పాటు చేయాలని, శిథిలావస్తలో ఉన్న క్వార్టర్లను తొలగించి ఆధునిక క్వార్టర్లు నిర్మించాలని పరిసర ప్రాంతాల్లోని రైతులు కోరుతున్నారు.



యర్ర పోతవరం లాకులు



పూర్తిగా శిథిలమైన క్వార్టర్లు

పూడుకుపోయిన పంట కాలువలు

ఇరిగేషన్ పరిధిలోని పలు పంట కాలువలు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో రామ చంద్ర పురం, కె.గంగవరం మండలాల్లో పలు పంట కాలువలు పూడుకు పోయి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో పంట కాలువలు మరమ్మతులకు నిధులు విడుదల చేసేవారు. ఈ ఏడాది పంట కాలువ మరమ్మతులకు నిధులు విడుదల చేయక పోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం పంట కాలువలు పై దృష్టి సారించాలని, అన్ని పంట కాలువలను ఆధునికరించి రైతులకు సక్రమంగా సాగు నీరు అందించాలి అని రైతుల కోరుతున్నారు. మొత్తం మండలాల్లో 75 కాలువలు మరమ్మతులకు అధికారులు గుర్తించినప్పటికీ వాటికి నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.



బాపనయ్య చెరువు సమీపంలో పూడుకుపోయిన పంటకాలువ

గుర్రపుడెక్క తొలగింపునకే నిధులు మంజూరయ్యాయి

లాకుల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. ఈ ఏడాది పంట కాలువల మరమ్మతులు నిధులు మంజూరు కాలేదు. తాము గుర్తించిన 75 పనులకు గాను 15 పనులు నిధులు మంజూరయ్యాయి. వాటిలో గుర్రపు డెక్క తొలగింపుకు సుమారు రూ.50 లక్షలు మంజూరయ్యాయని వీటిని రెండు రకాలుగా వంటకాలు వల్ల పేరుకున్న గుర్రపు డెక్కను తొలగిస్తాము.

- వి.సుజాత , ఇరిగేషన్ ఎఇ

సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ గ్రామపంచాయతీ పరిధిలో గల పలు సిమెంట్ రోడ్లకు మంత్రి సుభాష్ భూమి పూజ చేశారు. ఆదివారపుపేట నుంచి వెల్లసాపురం రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రూ.20 లక్షలతో ఉపాధి హామీ చట్టం నిధులతో రోడ్డు నిర్మిస్తారు. ద్రాక్షారామంలో కొత్త డంపింగ్ యార్డుకు రూ.6 లక్షల తో రోడ్, నున్నవారి వీధిలో రెండు సిమెంట్ రోడ్లు, రూ.8 లక్షల 90 వేల తో సిమెంట్ రోడ్లు, నిర్మిస్తారు. జీవీవ నిర్మించిన మార్కెట్ లో రూ.23.80 లక్షల నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపిటిసి సభ్యులు నున్న సత్యవతి, ఎంపిడిఒ పద్మ జ్యోతి, ఇఒపిఆర్‌డి సెలెట్ రాజు, పార్టీ నాయకులు పెంకె సాంబ శివరావు, మండల ఎఇ ఏసురత్నం, గ్రామ విఆర్ఓ వరంజ్యోతి, సర్వేయర్ సాయిరాం, సోమ శేఖర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసన్న, శివకిరణ్ పంచాయతీ కార్యదర్శి పెట్ట సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి సుభాష్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - మండపేట

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం రాయవరం మండలం, లొల్ల గ్రామంలో ఎంఎల్‌ఎ వివిధ ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రూ.8 లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, ఆర్ అండ్ బి రోడ్డు నుండి అల్లూరి గంగరాజు ఇంటివరకు రూ.8.90 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రెయిన్ రూ.4 లక్షలతో నిర్మించిన బరియల్ గ్రౌండ్‌లో సిసి రోడ్డు, జెజెఎం నిధులు రూ.45.90 లక్షలతో ఇంటింటికీ మంచినీటి కుళాయి పథకాన్ని ఎంఎల్‌ఎ వేగుళ్ల ప్రారంభించారు. కార్యక్రమంలో కంటిపూడి సర్వారాయుడు, సర్పంచ్ చాట్రాటి జానకి రాంబాబు, ఎంపిటిసి సభ్యుడు వైట్ల సతీష్, గ్రామశాక అధ్యక్షులు సుంకవల్లి గంగరాజు, కంటిపూడి కృష్ణ, పాతూరి రాంబాబు, రామచంద్రపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి, ఎంపిడిఒ స్పందన, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



లొల్లలో మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

జీతాల్లేక ఉపాధి హామీ ఉద్యోగుల అవస్థలు

ప్రజాశక్తి - రావులపాలెం

ఉపాధి హామీ ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాల్లేక తీవ్ర ఇవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మండల గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ లు 10మంది, ఆఫీసు సిబ్బంది 6 మంది విధులు నిర్వహిస్తున్నారు. అరకొరజీతాలతో కుటుంబాలు గడుపుకొంటున్నామని అసలే చాలీ చాలని జీతాలు అటుపై కుటుంబ భారం తో సతమతమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కుటుంబం లో ఏదైనా ఆరోగ్య సమస్య ఉత్పన్నం అయితే వైద్యం చేయించుకోలేని పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోందని వాపోతున్నారు. మేము ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి సకాలంలో జీతాలు అందేలా కృషి చేయాలని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ లు, ఆఫీసు సిబ్బంది కోరుతున్నారు.



ఉపాధి హామీ ఉద్యోగులు

పాఠశాలల్లో ఆడిట్లను వాయిదా వేయాలి

యుటిఎఫ్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆడిట్ల పేరుతో మండు వేసవిలో ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేయడం సరైన పద్ధతి కాదని, ఆడిట్లను వాయిదా వేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్ర కుమార్, ఎంటివి ఎఎస్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు రకరకాల పనులతో సుదూర ప్రాంతాల్లో ఉంటారన్నారు. రికార్డులన్నీ పాఠశాలలో ఉంటాయి. వీటిని సేకరించి ఇప్పటికిప్పుడు ఆడిట్ చేయమనడం సరైన పద్ధతి కాదన్నారు. ఇంకోపక్క బదిలీలు, రేషనైజేషన్ బిజీలో బిజీగా ఉన్నారన్నారు. కావున సర్వ శిక్ష అభియాన్ వారు ఈ ఆడిట్లను పాఠశాలలు తెరిచిన తరువాత నిర్వహించవలసిందిగా యుటిఎఫ్ శాఖ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టామని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణ, రూరల్ పరిధిలో ఎపి ఎస్‌సి, బిసి సంక్షేమ హాస్టల్స్ నందు ఆయన పర్యవేక్షణలో ఎసిఎం ఇండోర్ స్ప్రేయింగ్ మందును పిచికారీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమలను నివారించి విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే వ్యాధులు రాకుండా చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్‌వి రామారావు, ఎస్.రాజబాబు, ఫైలేరియా ఇన్‌స్పెక్టర్ ఎస్.సత్యనారాయణ పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ ఆర్.కామేశ్వరరావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు



మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న ఎంపిడిఒ, సర్పంచ్

ఉపాధి కూలీలకు మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - అంబాజీపేట

స్వర్ణాంధ్ర (బీట్ ద హీట్) కార్యక్రమంలో భాగంగా గంగలకుర్రులో వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని శనివారం ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. మండల పరిధిలో అన్ని గ్రామాలలో ఉష్ణోగ్రతల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశామని ఎంపిడిఒ గిడ్ల భీమారావు తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎక్కువగా నీరు తాగాలని ఉపశమన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తగు జాగ్రత్తలు పాటించాలని పలు సూచనలు చేశారు. అలాగే ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వద్ద ఎఇ ఆధ్వర్యంలో సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. తడి, పొడి ఎలక్ట్రికల్ వ్యర్థాలు సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కృష్ణ, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఉద్యోగులు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'పై అవగాహన



రామచంద్రపురంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. **అమలాపురం:** స్థానిక కలెక్టరేట్ నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాలను సిబ్బందితో సహా నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్ రాజకుమారి సిబ్బందితో ఆమె చేయించారు. ఈ కార్య క్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కె. కాశీ విశ్వేశ్వర రావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్, విదేశీ వ్యవహారాల విభాగం సిబ్బంది నాగేంద్ర, నాగ సుశీల, సెక్షన్ సూపరింటెండెంట్లు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **రామచంద్రపురం:** ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్నిఆయనప్రారంభించారు. అనంతరం ద్రాక్షారామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మజ్యోతి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. **అల్లవరం:** అల్లవరం గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన ఎంపిడిఒ బియస్‌యస్ యస్.కృష్ణ మోహన్, తహశీల్దార్ వివియల్. నరసింహ మూర్తి ఆధ్వర్యంలో 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'లో బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నీటి పారుదల సంఘం అధ్యక్షులు బి శివ నాగ ప్రసాద్, టిడిపి నాయకులు రాచూరి రాం బాబు, జనసేన నాయకులు వి.సత్యం, పంచాయతీ కార్యదర్శి యస్.రాజమోహన్ పాల్గొన్నారు. బోడసకుర్రు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర బీట్ ద హీట్ కార్యక్రమం సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. స్వచ్ఛంద్రా - స్వర్ణాంద్ర కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ కార్యాలయం నుండి జాతీయ రహదారి 216 పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం బళ్ళగేటు సెంటర్ లో మానవ హారం నిర్వహించారు. కార్యక్రమం లో ఎఇ పివి.సుధాకర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్, టిపిఒ రాజేష్ బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రాజు, మెప్మా సిఒ రాజేశ్వరి, సచివాలయల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **మండపేట:** వేసవి లో ఎండలు తీవ్రతగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండపేట పుర పాలక సంఘం కమిషనర్ టివి రంగారావు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమ్య లక్ష్మి, సూపర్ వైజర్ ఎన్.అనంతలక్ష్మీ, రెవిన్యూ అధికారి జెవియస్.శాస్త్రి, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ శాఖ కార్యాలయ పరిసరాలలో మనం వినియోగించిన తర్వాత పనికిరాని వ్యర్థాలుగా మారిన పరికరాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని వాటిని వేస్ట్ యార్డ్ కు తరలించేందుకు సిబ్బంది సహకరించాలని మండపేట సబ్‌స్టేషన్ ఎఇ ఎం.ముని, జెఇ వెంకటేశ్వం రావు పిలుపునిచ్చారు. 'స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్' కార్యక్రమంతో పాటుగా జంగిల్ క్లీనింగ్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాస్, లైన్మెన్లు రాజ్ కుమార్, విశ్వేశ్వరరావు, నరసింహారాజు, వాసు, భాస్కరావు, జేఎల్ఎంలు గణేష్, వెంకన్న బాబు, షిఫ్ట్ ఆపరేటర్ మురళి, తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు తమ సిబ్బందితో కలిసి హాజరై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సరోజినీ కుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ పి.పద్మ, గృహ నిర్మాణ శాఖ ఎఇ డి.శ్రీనివాస్, మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, ఎపిఎం ధనరాజు, ఎపిఒ అరుణకు మారి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** భీమనపల్లిలో సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా ఎపిడి రాంబాబు పాల్గొని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎంఎ షంషీ, ఎంపిడిఒ పిఎస్.రాజ్‌కుమార్, ఉపాధి ఎపిఒ ఎం. వీరబాబు, పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్ ల ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. **ఆత్రేయపురం:** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో 'బీట్ ది హీట్' అనే థీమ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమమునకు ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్, మండల స్పెషల్ ఆఫీసర్ ఎంవి.రామా రావు, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకటరామన్, గ్రామ సర్పంచ్ శ్రీమతి గెడ్డం సుధా పాల్గొని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. **రావులపాలెం:** పొడగట్లపల్లి పంచాయతీ పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం కార్యదర్శి టి.శుభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చలివేంద్రం కేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుడుపూడి వెంకటేశ్వర్లు, అల్లూరి పెద క్రష్ణంరాజు, వెలుగొట్ల త్రిమూర్తులు, సఖినాల గణపతి తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో మానవహారం



ఆలమూరులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం




ర్యాలీ నిర్వహిస్తున్న ఏరియా ఆసుపత్రి సిబ్బంది

రక్తపోటు ప్రాణాంతకం

ప్రజాశక్తి - అమలాపురం

రక్తపోటు ప్రాణాంతకమైన వ్యాధని, ప్రతి ఒక్కరూ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర పిలుపు నిచ్చారు .శనివారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి నుంచి నల్ల వంతెన వరకు ప్రపంచ రక్తపోటు దినోత్సవ ర్యాలీని రక్తపోటు నివారణ చర్యల నినాదాలతో నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఏడాది మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవా న్ని నిర్వహిస్తామన్నారు. రక్తపోటు స్థాయి సాధారణ స్థాయి కంటే పెరగడాన్నే హైపర్టెన్షన్ అంటారన్నారు హైపర్టెన్షన్ పై అవగాహన పెంచేందుకు ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారన్నారు. అధిక రక్తపోటు యొక్క ప్రమాదాల గురిం చి ప్రజలకు అవగాహన పెరగాల్సి ఉంద న్నారు. కూరగాయలు పండ్లు ఎక్కువ తీసుకోవడం గంటల తరబడి కూర్చో కుండా ఉండటం నడక, పరుగు, ఈత, డ్యాన్స్ లేదా బరువులు ఎత్తడం లాంటి వ్యాయా మాలు చేయాల న్నారు. రక్తపోటు నివారణ మన చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డి ఎంహెచ్ఒ సిహెచ్‌వి.భరతలక్ష్మి, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమలత, ప్రాంతీయ ఆసుపత్రి సిబ్బంది రాఘవేంద్రరావు, వెంకట్ రామకృష్ణ, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వివేకానందలో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి - రాజోలు



స్కూల్ లోగో

నైతిక విలువలతో కూడిన, క్రమశిక్షణతో తక్కువ ఫీజులకే కార్పొరేట్ స్థాయి విద్యాబోధన తమ వివేకనంద హై స్కూల్‌కి సాధ్యమని హైస్కూల్ కరస్పాండెంట్ పివివి.వరప్రసాద్ పేర్కొన్నార. ఈ విద్యా సంస్థలో ప్రారంభం నుంచి 10వ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక చదువుల నిలయం వివేకనంద పేరుగాం చిందన్నారు. వినయ విధేయతలతో చదువు మీద శ్రద్ధతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులకు వివేకనంద పుట్టినిల్లన్నారు. ఈ హైస్కూల్లో చదువుకొన్న అనేక మంది విద్యార్థులు నేడు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, టీచర్లుగా ఇంకా అనేక రంగాలలో స్థిరపడ్డారన్నది అక్షర సత్యమన్నారు. మా విద్యార్థులకున్న క్రమశిక్షణ, చదువు మీద ఆశక్తి, ఉపాధ్యాయులు, మహిళా టీచర్ల యొక్క నిత్య కృషి అని, ఇదంతటికీ కారణం విద్యార్థుల తలిదండ్రులు మా స్కూలు నందు ఉంచిన అపారమైన నమ్మకం అన్నారు. మా పూర్వపు విద్యార్థులు అనేక మంది ప్రతిభా అవార్డు ఎపి ప్రభుత్వంచే అందుకున్నారని అన్నారు. పోటీ పరీక్షలలో విజయం సాధించిన వారిలో కూడా తమ స్కూలు విద్యార్థులున్నారని అన్నారు. బట్టీ విధానం కాకుండా, సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగించే విధంగా సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌చే బోధన, విద్యార్థులకు అన్ని రకాల సదుపాయంతో తరగతి గదులు, ఉచిత స్టడీఅవర్స్ నిర్వహణ, మినరల్ వాటర్ సౌకర్యం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, అధునాతనమైన పద్ధతిలో కంప్యూటర్ విద్యాబోధన, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల నిర్వహణ, క్యాలిగ్రఫిక్ ద్వారా విద్యార్థులకు మంచి చేతి రాత శిక్షణ ఇస్తున్నా మని చెప్పారు. 1ఎం1బి జాతీయ యువ మార్పు తయారీదారుల రాష్ట్రపతి సదస్సుకు వివేకానంద విద్యార్థులు అర్హత సాధించి రాష్ట్రపతిచే అవార్డు పొందారన్నారు. ఒలింపియడ్‌లో రాష్ట్రంలోనే ప్రధాన ర్యాంక్‌లు తమ స్కూల్ విద్యార్థులకు వచ్చాయన్నారు.నేటి పోటీ ప్రపంచంలోమా విద్యార్థులు అనేక విజయాలు పొందినట్లు మా సంస్థ పట్టుదలతో ముందుకు సాగుతుందనిఆకాంక్షిస్తున్నామన్నారు.



:సిఎం చంద్రబాబుచే ప్రశంసలు



ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

విద్యార్థుల తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని ఏ మాత్రం వమ్ముచేయకుండా విద్యార్థుల ఉత్తమ భవిష్యతే లక్ష్యంగా పెట్టుకొని కృషి చేస్తున్నాం. నర్సరీ నుంచి తమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు పూల బాట వేయాలనుకునే తల్లిదండ్రులు తమ పిల్లలను వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో చేర్పించాలని మనవి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బంధంతో అన్ని రకాల వసతులతో శిక్షణ ఇస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేరే విధంగా తీర్చి దిద్దుతాం.

-పివివి వర ప్రసాద్,పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్



రాష్ట్రపతి ముర్ముతో వివేకానంద స్కూల్ విద్యార్థులు

హైస్కూల్ ప్రత్యేకతలు

- నర్సరీ నుంచి టెన్త్ వరకూ అనువజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన
- చక్కని క్రమశిక్షణ మా విద్యార్థుల చదువులో భాగమే
- విద్యార్థుల మేథాశక్తిని గుర్తించి వారిని ప్రోత్సహించడం
- కార్పొరేట్ స్కూల్‌కు ఏమాత్రం తీసిపోని అత్యాధునిక వసతులు
- విద్యార్థి విజయమే 'మా స్కూల్ నినాదం'
- సాంస్కృతిక కార్యక్రమాలకు మా స్కూలు ప్రత్యేక ఆకర్షణ
- ఐఐటి, జెఇఇ, నీట్ వంటి ఉన్నతమైన చదువులకు ప్రత్యేక శ్రద్ధ
- 1-5 తరగతుల నుంచి కంప్యూటర్ శిక్షణ, అబాకస్ క్లాస్ నిర్వహణ
- సిసి కెమేరాలతో విద్యార్థులను నిత్యం పర్యవేక్షణ
- చదువులో ప్రతిభను కనపరచిన విద్యార్థులకు ఫీజులో రాయితీ
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు
- ఆటలు, యోగా, డ్యాన్స్, కరాటే తరగతుల నిర్వహణ

నేరాలు ఘోరాలు

యువకుని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రమాదవశాత్తు కాలుజారి గౌతమీ గోదావరి నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం రావులపాలెం బ్రిడ్జి వద్ద లభ్యమయింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తలపాకుల జగపతిబాబు (20) హైదరాబాదులో ఒక కంపెనీలో ఆఫీస్ బాయ్ గా పని చేస్తున్నాడు. ఆత్రేయపురం బుల్లిపేట లో ఉన్న తన మేనమామ కుమారుడు పుట్టినరోజు వేడుకలకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గౌతమి గోదావరి నది తీరానికి బహిర్భూమికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో మునిగి గల్లంతయ్యాడు.. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ జగపతిబాబు ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టగా రావులపాలెం జొన్నాడ బ్రిడ్జి వద్ద యువకుడు లభ్యం అయ్యింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జాతీయ రహదారిపై లారీ ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతీ పరిధి బొండాయి కోడు తూము సెంటర్ పెట్రోల్‌బంక్ ఎదురుగా మోటార్‌సైకిల్‌పై అయినవిల్లి మండలం పోతుకుర్రుకు చెందిన సాగిరాజు సత్యనారాయణ రాజు (47) వెళుతున్నాడు. ఈ సమయంలో అతనిని వెనక నుండి లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి 8 మంది అరెస్టు

ప్రజాశక్తి-కాజులూరు

గొల్లపాలెంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.7,400 నగదు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్టు ఆయన తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట

సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చగా జరిమానా విధించినట్టు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల పరిధిలో వివిధ ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 12 మందిని పట్టుకున్నట్టు తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా ఏడుగురికి ఒకొక్కరికీ రూ.పది వేల చొప్పున జరిమానా విధించారని, ఐదుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.

రైలు కిందపడి జంట ఆత్మహత్య

ప్రజాశక్తి -సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం గుడపర్తి రైల్వే ట్రాక్‌పై శనివారం రైలు కిందపడి ఒక జంట ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులను కాకినాడ స్వర్ణాంధ్ర కాలనీకి చెందిన ఉప్పల పోసుబాబు (37) కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన గెడ్డం దివ్య నాగలక్ష్మి (30)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరు శుక్రవారం రాత్రి కాకినాడ నుంచి బైకుపై సామర్లకోట వచ్చి అక్కడి నుంచి వేట్లపాలెం వెళ్ళి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటారని సామర్లకోట రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుని జేబులో సూసైడ్ నోట్, బండి పార్కింగ్ చీటి లభ్యమయ్యాయి. లేఖలో రాసి ఉన్న ఫోన్ నెంబర్లు ఆధారంగా మతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. పోసుబాబు ప్రయివేటు అకౌంటెంట్ కాగా భార్య, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. వారం రోజుల క్రితం తనకు మరో భార్య ఉందని తనని ఇంటికి తీసుకువస్తానని పోసుబాబు భార్యతో చెప్పడంతో కుటుంబంలో గొడవ జరిగింది. మృతుడి భార్య అమ్మగారి ఇంటికి వెళ్ళిపోయింది. శుక్రవారం రాత్రి తాను చనిపోతున్నానని అందరూ జాగ్రత్తగా ఉండాలని ఫోన్ చేసి మతుడు పోసుబాబు చెప్పాడు. దీంతో ఆ కుటుంబం అంతా కాకినాడ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసి గాలించడం మొదలు పెట్టారు. మృతురాలు గెడ్డం దివ్య నాగలక్ష్మి భర్తతో విభేదాలు వచ్చి ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఒక పాప ఉంది. మృతురాలి తల్లి సామర్లకోట పోలీసులకు వివరాలు అందించారు.

హసన్‌బాదను గ్రేడ్- 2 పంచాయతీగా మార్చాలని వినతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్ బాద గ్రామం కేవలం 27 మంది జనాభా తక్కువ ఉన్న కారణంగా గ్రేడ్ 3 గా పరిగణించబడుతోంది., తద్వారా గ్రేడ్ 2 పంచాయితీలకు అందించనున్న కొన్ని సదుపాయాలను కోల్పోతుంది. ప్రస్తుత గ్రామ ఆరోగ్య సర్వే ప్రకారం హసన్ బాద గ్రామ జనాభా 2000 పైగా ఉంది.చుట్టు పక్కల ఉన్న కొన్ని గ్రామాలకు హసన్ బాద గ్రామం సెంటర్. ఈ గ్రామాన్ని గ్రేడ్ 2 పంచాయతీగా పరిగణించాలని గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, కార్యదర్శి కాశి రాకేష్ కుమార్ మంత్రి సుభాష్ ని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు తెలియజేశారు.

అమ్మవారికి వెండి కవచం బహూకరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

పెదపట్నం లంక గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారికి జాతరను పురస్కరించు కొని శనివారం రూ.3లక్షల వ్యయంతో చేయించిన వెండి కవచనాన్ని బహూకరించారు. శిరిగినేడి కృష్ణమూర్తి, నాగమణి దంపతుల కుమారుడు, కోడలు 3.25 కిలోల వెండితో తయారు చేయించారు ఈ కవచాన్ని సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు.

ధాన్యం రైతు కంట కన్నీరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో వరి రైతుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలకు చేతలకు పొంతనే ఉండట్లేదు. ఫలితంగా ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కళ్లాల్లోనే మురుగుతోంది. ఈ ఏడాది దిగుబడి గణనీయంగా పెరిగింది. ఈ మేరకు కొనుగోళ్లను పెంచాల్సి ఉన్నా.. ప్రభుత్వం అలాంటి చర్యలేవీ తీసుకోలేదు. ముందుగా నిర్ణయించిన లక్ష్యాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అనంతరం కొనుగోలు కేంద్రాలను మూసేశారు. దీంతో మిగిలిన రైతుల వద్ద ఉన్న ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. దీంతో అన్నదాతలు రోడ్డెక్కారు. ఎట్టకేలకు దిగొచ్చిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు లక్ష్యాలను పెంచింది. స్వయంగా సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడలో ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష చేసి ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పెంచుతున్నామని చెప్పారు. అనంతరం మంత్రులు, ఎంఎల్ఎలు ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ లక్ష్యం పెంపుపై ఊదరగొట్టారు. కాని ధాన్యాన్ని మాత్రం అనుకున్న మేర కొనుగోలు చేయలేదు. మంత్రులు ప్రకటనల అనంతరం పలుచోట్ల ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు మళ్లీ రోడ్డెక్కారు. ధాన్యం లోడు ట్రాక్టర్‌తో కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద ఉన్న హైవేపై రాస్తారోకో చేశారు. అధికారులు హడావుడిగా అక్కడకు చేరుకుని కొనుగోళ్లు చేస్తాని హామీ ఇచ్చారు తప్ప, పరిస్థితిలో మాత్రం మార్పు లేదు. వాతావరణంలో అకాల మార్పులతో కురుస్తున్న ఆకస్మిక వర్షాలకు రైతుల వద్ద ఉన్న ధాన్యం తడిసిపోతోంది. దీంతో దళారులు చెప్పిన రేటుకు అమ్ముకుని నష్టాలకు గురవుతున్నారు.

మరో పక్క జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు తారెత్తిస్తున్నాయి. 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రోహిణీ కార్తెకు ముందే ఎండలు ఇలా ఉండటంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. వడగాల్పులు నానాటికీ అధికమవటంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలో వడదెబ్బ మృతుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికమవుతోంది. దీంతో మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకూ



జిల్లాలో అనేక ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. పాలనా యంత్రాంగం ఏర్పాటు చేసిన చలివేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి.

ఆధునికీకరణ జరిగేనా?

గోదావరి పంటకాలువల ఆధునికీకరణ పనులు జరుగుతాయా? లేదా? అనే దానిపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. కాలువను కట్టేసి 15 రోజులు పైబడినా ఎక్కడ ఆధునికీకరణ పనులు మాత్రం కనిపించట్లేదు. ఏటా వేసవిలో కాలువలకు నీటి ప్రవాహాన్ని నిలిపేసిన సమయంలో కాలువల్లో పూడికతీత, గేట్ల మరమ్మతులు వంటి పనులు నిర్వహిస్తారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని బలహీనంగా ఉన్న కరకట్టలకు మరమ్మతు చేయాల్సి ఉంటుంది. కాల్వల ఆధునికీకరణ, తూడు తొలగింపు, గోదా వరి డ్రెడ్జింగ్ నిర్వహణ వంటి పనులు ఈ కాలంలోనే చేపట్టాల్సి ఉంది. తాజాగా క్లోజర్ పనులకు ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. ఇరిగేషన్ అధికారులు రూ.70 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వ పట్టించుకోలేదు. ఈ పనులకు ఇప్పటి వరకూ టెండర్లు కూడా పిలువ లేదు. దీంతో ఈ ఏడాదీ ఆధునికీకరణ పనులపై సందిగ్ధత నెలకొంది.ఇదే జరిగితే వరదలకు పంటలు ముంపునకు గురవ్వడం, లేదా వర్షాల సమయంలో నీరు వెళ్లక పంటలు పాడవ్వడం తప్పదనే అనుమానాలున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రైతాంగా కోరుతోంది.

కూరగాయల ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. పెళ్లిళ్ల సీజన్, ఎండాకాలంలో కూరగాయల సాగు తగ్గడంతో కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. వంకాయ, దోస, కాకర, చిక్కుళ్లు ఇలా ఏ రకం చూసినా కేజీ రూ.80 పైమాటే. అల్లం కేజీ రూ.150కి చేరింది. వెల్లుల్లి పాయలు కేజీ రూ.360 పలుకుతున్నాయి. ధరలు పెరగడంతో కొనుగోలు దారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో కొనుగోలు దారులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు.

పలు చోట్ల చలివేంద్రాల ఏర్పాటు



ప్రారంభిస్తున్న వెంకటాయపాలెం సర్పంచ్ సతీష్‌కుమారి

ప్రజాశక్తి - యంత్రాంగం

అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో శనివారం జిల్లాలో పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటుచేశారు.వివరాలు ఇవి..

రామచంద్రపురం: మండలంలోని వెంకటాయపాలెం గ్రామం పంచాయతీ హెల్త్ సబ్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాపికప గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్ కుమారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రతి ఒక్కరికి తాగునీటి అవసరాలు పెరుగుతాయని, మానవులకు, పక్షులకు నీరే ప్రధాన ఆధార మని, ప్రజలు ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరు వేసవిలో వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అరుణ కూటమి నాయకులు, పంచాయితీ, సచివాలయం సిబ్బంది ,హెల్త్ సిబ్బంది , గ్రామ ప్రజలు పాల్గొన్నారు. **ఆలమూరు:** ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వేడి గాలుల ప్రభావం నుంచి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వారి దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు ప్రారంభించామని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. ఆయన శనివారం మండల కేంద్రంలో స్థానిక టిడిపి నాయకులతో కలిసి వేర్వేరు చోట్ల చలివేంద్రాలు ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణం వద్ద కార్యాలయాలకు వచ్చే వారికి, అలాగే గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వద్ద, వినాయకుని గుడి సమీపంలోను, అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద చలివేంద్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వేసవి కాలాన్ని దష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేడి గాలుల తీవ్రతను సిబ్బందికి వివరించి, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.లావణ్య కుమార్ రాజా, ఉప సర్పంచ్ చల్లా లక్ష్మీభూషణం, కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్, ఈదల నల్లబాబు, రామానుజుల శేషగిరిరావు, చల్లా బాబి తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** మండుతున్న ఎండలకు దాహార్తిని తీర్చేందుకు శనివారం విలసవిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సర్పంచ్ సలాది ఊర్మిళదేవి ప్రారంభించారు. చలివేంద్రం వద్ద ప్రయాణికులకు మజ్జిగను సర్పంచ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి డి.శివప్రసాద్, విఆర్ఒ,కె.రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఆలమూరు బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రం


విలసవిల్లిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఊర్మిళదేవి


ద్వారపూడిలో పశువులకు మంచినీటి వసతిని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

గ్రామ పంచాయతీల్లో వేసవి ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - మండపేట

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామ పంచాయతీలలో శనివారం వేసవి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 12 గ్రామపంచాయతీలలో బీట్ ది హిట్ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఒ సత్యనారాయణ ద్వారపూడి లో బస్ షెల్టర్ కి షెడ్డు ఏర్పాటు, ద్వారపూడి శివారు వేములపల్లి వద్ద పశువులు తాగడానికి వేసవిలో ఏర్పాటుచేసిన మంచినీటి వసతిని పరిశీలించారు.గ్రామ పంచాయతీలలో మొక్కలు నాటడం, ఉపాధి హామీ కూలీలకు వేసవిలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. పలు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ డి.శ్రీనివాసు, ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వినకోట వీర వెంకట సత్యనారాయణ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి 4 గంటల సమయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి శనివారం 4 గంటల సమయం పట్టింది. పగటి ఉష్ణోగ్రతలు ఉక్కపోతగా ఉండటంతో క్యూలైన్లో యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్‌రావు కూలర్లను ఏర్పాటు చేయించారు. ఆలయ మాడవీధులలో ఏడు ప్రదక్షణలు చేసే యాత్రికులకు ఎండ వేడి తగలకుండా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సుమారు 80 వేలుపై పడే స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి తాగునీరు, మజ్జిగ, బిస్కెట్లను పంపిణీ చేశారు.


భర్త ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో సుప్రియ ధర్నా

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

ప్రజాశక్తి - ఆలమూరు

అదనపు కట్నం కోసం భర్త వేధింపులకు గురి చేయడంతో భార్య తన కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట ధర్నా చేపట్టింది. ఈ సంఘటన జొన్నాడలో శనివారం చోటుచేసు కుంది. బాధితురాలు పడాల సుప్రియ తెలిపిన వివరాల ప్రకారం 2020లో రాయవరం మండలం లోని మాచవరంకు చెందిన నేను జొన్నాడకి చెందిన పడాల వీర వెంకట రామారెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నామన్నారు. వివాహ సమయంలో నా భర్త రామారెడ్డికి రూ.5 లక్షల నగదు, 20 సెంట్లు వ్యవసాయ భూమి, 18 కాసుల బంగారాన్ని వరకట్నంగా మా తల్లిదండ్రులు అప్పగించారనిన్నారు. వివాహం జరిగి నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ నేను గర్భవతినీ కాకపోవడంతో నీకు పిల్లలు పుట్టరు అనే నెపంతో మా పుట్టింటికి తీసుకొని వెళ్లి నా భర్త రామారెడ్డి వదిలేసి వెళ్లిపోయాడని తెలిపింది. కొన్ని రోజుల తరువాత పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చి మమ్మలి జొన్నాడలో కాపురం పెట్టించార న్నారు. మరో 6 నెలల అనంతరం నన్ను అదనపు కట్నం తేవాలని మా అత్త, భర్త రామారెడ్డి వేధించడం మొదలు పెట్టారు. దీంతో వారి వేధింపులు తట్టుకోలేక తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి, రాయవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాను. అయినా ఎటువంటి ప్రయోజనం చేకూర లేదనీ వాపోయింది. ఎట్టకేలకు భర్త రామారెడ్డి తన ఇంటికి సుప్రియ రావాలని పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుని కాపురం మొదలు పెడదామన్నాడు. అది నమ్మిన నేను శనివారం మాట్లాడ డానికి జొన్నాడ గ్రామానికి చేరు కోగా ఆ సమయంలో తనను భర్త చితకబాది, హత్య చేసేందుకు ప్రయత్నించారని ఆమె వాపోయింది. దీంతో స్థానిక పెద్దల సహకారంతో తనకు న్యాయం చేయాలని సుప్రియ కుటుంబ సభ్యులు భర్త ఇంటి వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. అధికా రులు న్యాయం చేయాలని ఆమె కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' ప్రచార ఆర్భాటమేనా?

ప్రజాశక్తి - పి.గన్నవరం

గంటి పెదపూడి నుండి వాడ్రేవుపల్లి వరకూ ఎనిమిది గ్రామాలకు 14 కిలోమీటర్లు ప్రధాన పంట కాలువను ఐదు వేల మంది ఉపాధి హామీ కూలీలతో శుభ్రం చేయిస్తానని శుక్రవారం ఎంపిడిఒ కెవి.ప్రసాద్ ప్రకటన ప్రచారం ఆర్భాటమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా చోట్ల ప్రధాన పంట కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం, వంతెనల సమీపంలో పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తున్నా సంబంధిత అధికారులకు పట్టడం లేదని ప్రజల అంటున్నారు. మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల పరిధిలోని సుమారు ఇరవై వేల ఎకరాల పంట భూమికి సాగునీరు అందుతుంది. అలాగే మంచినీటి ప్రాజెక్టులకు ఈ పంట కాలువ నుండి తాగునీరు సరఫరా అవుతుంది. ఇంతటి ప్రధానమైన కాలువలో వ్యర్థాలు పూడుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈ కాలువను శుభ్రం చేయిస్తామని అధికారులు ప్రకటించినా ఆ స్థాయిలో పనులు జరగకపోవడం విమర్శలకు తావిచ్చింది. మండుటెండలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా 5 వేల మందిని సమీకరిస్తామని గొప్పలు పోవడం ఇక్కడి అధికారులకే చెల్లింది. తీరా చూస్తే కాలువలో వ్యర్థాలు యథాతథంగా కనిపిస్తున్నాయి. అసలు మండల పరిధిలో ఉపాధి హామీ కూలీలు ఎంతమంది. అనే ప్రశ్నకు అధికారులు నీళ్లు నమిలారు. ఐదు వేల మంది ఉపాధి హామీ కూలీలు పనులకు హాజరయ్యారా అంటే తడబడ్డారు. దీంతో ఇదేమి స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద అని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎంపిడిఒ కె.వి.ప్రసాద్ ను వివరణ కోరగా పొంతన లేని సమాధానం ఇచ్చారు.


ఊడిమూడి వద్ద ప్రధాన పంట కాలువలో చెత్త, వ్యర్థాలు

యాత్రికులతో కిటకిటలాడిన మందపల్లి

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనీశ్వర) స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిటకిటలాడింది. వేకువజామునే ఆలయానికి చేరుకున్న యాత్రికులు శనిదోష నివారణకు తైలాభిషేకాలు చేయించుకున్నారు. అనంతరం.స్వామి వారిని దర్శించుకున్నారు.దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం స్వీకరించారు. యాత్రికుల రద్దీనిదష్టిలో పెట్టుకొని దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తైలాభిషేకాల ద్వారా అన్న ప్రసాద విరాళాలుగా రూ.31,748 వెరసి .మొత్తంగా రూ. 1,62,878 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలో 19 పంచాయతీ కార్యాలయాల్లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సందర్భంగా శానిటేషన్, యాక్టివిటీస్, బీట్ ది హిట్ కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. గాంధీ సెంటర్లో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌టివి.రాజేశ్వరరావు, ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్, మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పులు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమాలో అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాలు

ప్రజాశక్తి - అల్లవరం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ నిత్యావసరాలు, వంట సామగ్రి శనివారం అందజేశారు. తూర్పులంక గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై మంద వీర వెంకట సత్యనారాయణ బ్రదర్స్ సంబంధించిన ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతిఅయ్యింది. బాధిత కుటుంబానికి ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ బొమ్మి నరసింహమూర్తి మంగాయమ్మ ట్రస్ట్ ద్వారా బాధితులకు బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులు ,వంట సామగ్రి, దుస్తులు, కూరగాయలు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ బాధితులకు తక్షణమే నూతన గృహాన్ని మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల అధ్యక్షులు ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ కడలి గంగాజలం, రేవు శ్రీనివాసరావు, మల్లవరపు శ్రీను, బుంగ ఆనంద శేఖర్,గ్రామ కమిటీ సభ్యులు గెద్దాడి సింహాద్రి, కట్టా నరేష్ ,కట్టా శ్రీను, బొంతు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న ఎంఎల్‌సి ఇజ్రాయిల్

విజ్ఞాన సర్వస్వం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మండపేట

మండపేట శాఖా గ్రంథాలయంలో శనివారం రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన విజ్ఞాన సర్వస్వం వ్యాస సంకల్పనం పుస్తకాలను ఆవిష్కరించారు. అంబేద్కర్ జిల్లా గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ మాత చినబాబు అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అభ్యుదయ రచయితుల జిల్లా సంఘం అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్, గ్రంథాలయాధికారిణి ఎస్.పూర్ణమ్మ, తదితరులు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా కన్వీనర్ చినబాబు మాట్లాడుతూ ఈ పుస్తకంలో స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రారంభమైన గ్రంథాలయ ఉద్యమం జాతీయ ఉద్యమానికి దోహదపడిన అంశాలు, తొలినాటి గ్రంథాలయాలు, ప్రజా జీవనంలో పౌర గ్రంథాలయాలు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమము, గ్రంథాలయ చట్టాలు, గ్రంథాలయ సమాచార శాస్త్రం, గ్రంథాలయ ఉద్యమ సారధులు, సాహిత్య పఠనం తదితర అంశాల పై విలువైన వ్యాసాలు ఉన్నాయన్నారు. గ్రంథాలయాలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ పుస్తకాన్ని ప్రచురించామన్నారు. జిల్లాలోని శాఖా గ్రంథాలయాలకు విజ్ఞానం పుస్తకాలను అంద చేస్తున్నామని, ముందుగా మండపేట శాఖ గ్రంథాలయానికి గ్రంథాలయ విజ్ఞానం పుస్తకాన్ని బహూకరించినట్లు ఆయన తెలిపారు .


పుస్తక ఆవిష్కరణలో పాల్గొన్న స్వామి ప్రసాద్ తదితరులు

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి - రావులపాలెం

ఇటీవల జనసేన లోకి చేరిన మెర్లపాలెం వైసిపి కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో గోపాలపురం ఆయన ఇంటి వద్ద వీరంతా పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం మీటింగ్ అని చెప్పి తీసుకెళ్ళి కండువాలు వేశారని మేము ఎప్పుడూ మీతోనే మీ వెంటే ఉంటామని మాజీ ఎంఎల్ఎ జగ్గిరెడ్డి కి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వీర్రాజు, నాని, సునీల్, చంటి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న కొత్తపేటలో మహానాడు

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఈనెల 19న నియోజకవర్గ టిడిపి మహానాడు సదస్సు జరుగుతుందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబి శనివారం తెలిపారు. కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అధ్యక్షతన ఉదయం 8 గంటల నుంచి సదస్సు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఉదయం పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం ఎంఎల్ఎ సత్యానందరావు సందేశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

దస్తావేజులు పోయినవి

ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం కాపురస్తులు **పినకా వెంకట్రావు గారి కుమారుడు పినకా శ్రీనివాస్ గారు** యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా యొక్క ఆస్తికి సంబంధించి లింకు దస్తావేజులు **(1) తేది. 10-9-2004, దస్తావేజు నెం. 3409/2004, (SRO, సామర్లకోట)** మరియు **(2) తేది. 31-3-1997, దస్తావేజు నెం. 1437/1997, (SRO, సామర్లకోట)** కలవు. మా అమ్మాయి మ్యారేజ్ నిమిత్తం లోను కోసం మా ఇంటి నుండి ది. 25-04-2025వ తేదీన సర్పవరం సెంటర్‌లో గల బ్యాంకుకు సంచిలో ఉంచుకొని బైకుపై వెళ్ళుచుండగా సదరు లింకు దస్తావేజులు కలిగిన సంచి దారి మార్గంలో పడిపోయినవి. కావున ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పినకా శ్రీనివాస్, S/o. వెంకట్రావు,
డో.నెం. 12-28/1, 1వ ఫ్లోర్,
సుభానికేతన్ స్కూల్ ఎదురుగా, ఎఫ్‌సిఐ కాలనీ
రోడ్డు నెం.1, కాకినాడ రూరల్ మండలం
కాకినాడ జిల్లా, సెల్: 8341814477

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట గాంధీనగర్, డోర్ నెంబర్ 18-9-51 కాపురస్తులు లోకవరపు సత్తిబాబు గారి కుమారుడు **లోకవరపు కొండబాబు** యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **U 2702483** తేది. 07-12-2020 కలది జిరాక్స్ నిమిత్తం తేది. 03-5-2025వ తేదీన మా ఇంటి నుండి సామర్లకోట రైల్వేస్టేషన్ సెంటర్ వద్ద ఉన్న జిరాక్స్ షాపునకు ఒరిజినల్ పాస్‌పోర్టు తీసుకుని వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కావున పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.

లోకవరపు కొండబాబు
సెల్: 9603771123

కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

I.P. No. 236/2018 in O.S.No. 396/2017

Between :

గొలుగూరి వెంకటరెడ్డి
తండ్రి సుబ్బిరెడ్డి, మాధవపట్నం, సామర్లకోట మండలం. ...వాది/డిక్రీహోల్డరు

మరియు

మల్లవరపు ఇజ్రాయల్
తండ్రి జానకిరామయ్య, టీచరు, ఎం.పి.పి.స్కూలు గొల్లపాలెం గ్రామం, కాజులూరు మండలం
....ప్రతివాది/జడ్జిమెంటుడెట్టారు

పై నెంబరు అమలు గ్రంథంలో జడ్జిమెంటు డెట్టారుకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టువారు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుటచేత శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం, యీ ప్రకటన జారీ చేయడమైనది, పై నెంబరు కేసు **ది. 18-06-2025** వాయిదావున్నది. మీరు స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ **10.30 గంటలకు** హాజరై అభ్యంతరములు తెలుపని యెడల మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.

అవసరాల నాగరాజు, B.Sc., B.L.
పిటీషనర్ తరపు అడ్వకేట్
డో.నెం. 8-13-9/23, Srya బిల్డింగ్
ప్రతాప్‌నగర్, కాకినాడ-4
సెల్: 99128 41155

కాకినాడ.
ది.17-05-2025

నోటీసు

మహారాజశ్రీ 7వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కాకినాడ
ఐ.ఏ. నెం. 365/2024 ఇన్ ఒ.ఎస్. నెం. 759/2023

మధ్యన:
శ్రీమతి కొప్పిశెట్టి సత్యవతి
-పిటీషనర్/ వాది
మరియు
అనుసూరి వెంకటరమణ
-రెస్పాండెంటు/ ప్రతివాది

టు:
అనుసూరి వెంకటరమణ, తండ్రి: వెంకటరమణ, డోర్ నెం. 3-167, పాత గైగోలుపాడు, కాకినాడ రూరల్ మండలం.

పిటీషనర్ ఫైనల్ డిక్రీ పాస్ చేయించమని పై నెంబరు పిటీషన్‌ను దాఖలు చేసివున్నారు. సదరు పిటీషనులో రెస్పాండెంటుకు ఎన్నిమార్లు నోటీసు పంపించినను పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు పిటిషన్ పై కోర్టులో **ది. 20-6-2025వ సం॥రం తేదిని ఉదయం 10.30 ని॥లకు** వాయిదా అయ్యి వున్నది. కావున రెస్పాండెంటు స్వయముగా గాని, లేక ప్లీడరు గారి ద్వారా గాని సదరు తేదిని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల పరోక్షమందు తీర్మానించబడును.

వి.వి.కేశవ రమణరావు
అడ్వకేటు, వినుకొండ వారి వీధి
కాకినాడ కాకినాడ-533001
07-05-25 సెల్: 9848048497